TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి





EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:52 FRIDAY ,JULY 3,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 52 శుక్రవారం 3 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-


### ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం..

## మంత్రి పొన్నం సవాల్



2

గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు.

## తెలంగాణలోని నిరుద్యోగులకు తీపి కబురు..

### ఇంటర్వ్యూలు లేకుండానే 984 వర్సిటీ ఉద్యోగాల భర్తీ

- మూడు విశ్వవిద్యాలయాల్లో 984 పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం
- నియామక ప్రక్రియలో ఇంటర్వ్యూ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తూ కీలక నిర్ణయం
- కేవలం రాతపరీక్ష, మెరిట్ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరగాలని సీఎం ఆదేశం
- అక్రమాలకు తావులేకుండా పోస్టుల భర్తీకి ఈ నిర్ణయం
- ప్రభుత్వ నిర్ణయంపై నిరుద్యోగ అభ్యర్థులు, విద్యావేత్తల నుంచి హర్షం




2

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు, విద్యావంతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలోని మూడు ప్రతిష్టాత్మక వ్యవసాయ అనుబంధ విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 984 అధ్యాపక, ఇతర పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈ నియామక ప్రక్రియలో అత్యంత కీలకమైన మార్పునకు శ్రీకారం చుడుతూ, ఇప్పటివరకు ఉన్న ఇంటర్వ్యూ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి

## అమెరికాలో దారుణం.. 16 మంది

### చిన్నారులను బంధించిన కుటుంబ సభ్యులు..

అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భ్రాంతికి గురి చేశాయి.



2

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్

### ధరలు తగ్గే అవకాశం: కేంద్రమంత్రి

- అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు స్థిరంగా కొనసాగడమే ఇందుకు కీలకం
- ఇప్పటికే పెట్రోల్ పై రూ.5, డీజిల్ పై రూ.3 తగ్గించిన నయారా ఎనర్జీ
- ఇప్పటికే తగ్గిన కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు



2

## సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు

### దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్


రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు.



2

## స్పీడ్ పోస్టులో

## గంజాయి దందా



2

- భారీ నెట్‌వర్క్ బట్టబయలు చేసిన హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్
- స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు
- ఝార్ఖండ్ కేంద్రంగా దేశంలోని 21 రాష్ట్రాలకు డ్రగ్స్ పంపిణీ
- 'మందులు' అని చెప్పి పార్శిళ్లలో గంజాయి ప్యాక్ చేసి దందా
- హైదరాబాద్‌లో ఇద్దరు కొనుగోలుదారుల అరెస్ట్, 2 కిలోల గంజాయి స్వాధీనం
- పోస్టల్ పార్శిళ్లకు స్కానింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రానికి లేఖ రాస్తామన్న పోలీసులు

## బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. కల్వకుంట్ల కవిత అరెస్ట్

- తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని ఆరోపణ
- కవితతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2



## ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం.. మంత్రి పొన్నం సవాల్

తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్

రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు. గన్‌పార్క్‌కు వెళుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు. నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.

## బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. కల్వకుంట్ల కవిత అరెస్ట్

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ శివారులోని బోడుప్పల్‌లో గురువారం ఆమె నిరసన కార్యక్రమం నిర్వహిస్తుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. కవితతో పాటు పలువురు తెలంగాణ జాగృతి నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని కవిత ఆరోపించారు. ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో ఉద్యమకారులకు భూములు కేటాయించడంలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆమె విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆమె ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆందోళన సందర్భంగా పోలీసులు, నిరసనకారుల మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. అనంతరం కవితను, ఇతర నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్టుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## స్పీడ్ పోస్టులో గంజాయి దందా

భారత తపాలా శాఖకు చెందిన స్పీడ్ పోస్ట్ సేవలను అడ్డంపెట్టుకుని దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న భారీ అంతరాష్ట్ర ముఠా గుట్టును హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు రట్టు చేశారు. ఝార్ఖండ్ కేంద్రంగా సాగుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయడంతో పాటు, హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఝార్ఖండ్‌లోని గిరిడ్ జిల్లాకు చెందిన సత్యం మిశ్రా ఈ ముఠాను నడుపుతున్నాడు. స్థానికంగా లభించే గంజాయిని సేకరించి, 'ఔషధాలు' అని తప్పుడు డిక్లరేషన్‌తో పార్శిళ్లలో ప్యాక్ చేసి, స్పీడ్ పోస్ట్ ద్వారా దేశంలోని 21 రాష్ట్రాలకు పంపేవాడు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ, యూపీఐ ద్వారా నగదు స్వీకరించేవాడు. ఈ అక్రమ వ్యాపారం ద్వారా రోజుకు రూ. 1 లక్ష, నెలకు రూ. 30 నుంచి 35 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా వార్షిక టర్నోవర్ సుమారు రూ. 4 నుంచి 5 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ముఠాలో సత్యం మిశ్రా సోదరుడు శుభం మిశ్రాతో పాటు మరికొందరు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఝార్ఖండ్ నుంచి పంపిన కొన్ని పార్శిళ్లను హైదరాబాద్‌లో అధికారులు అడ్డుకోవడంతో ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. నగరంలో పార్శిళ్లు అందుకున్న సుశాంత్ వ్యాస్, లడ్డా అనే ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పై గుడిమల్కాపూర్, ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన పోస్టల్ సర్వీసుల్లోని భద్రతా లోపాలను ఎత్తిచూపుతోందని, పార్శిళ్లకు తప్పనిసరిగా స్కానింగ్ ప్రక్రియను అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు.

## తెలంగాణలోని నిరుద్యోగులకు తీపి కబురు.. ఇంటర్వ్యూలు లేకుండానే 984 వర్సిటీ ఉద్యోగాల భర్తీ

ఇకపై కేవలం రాతపరీక్షలో సాధించిన మార్కులు, అకడమిక్ మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ), కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ), పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం (పీవీఎన్ఆర్‌టీవీయూ) లలో ఈ నియామకాలు చేపట్టనున్నారు. వ్యవసాయ శాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నియామక ప్రక్రియలో పారదర్శకతను పెంచడం, ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావులేకుండా చూడటమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రూప్-1 వంటి ఉన్నతస్థాయి ఉద్యోగ నియామకాల్లో ఇంటర్వ్యూలను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే విధానాన్ని విశ్వవిద్యాలయాల నియామకాల్లోనూ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**భర్తీ కానున్న పోస్టుల వివరాలు**

ప్రభుత్వ నిర్ణయంతో మూడు వర్సిటీల్లో నియామకాల ప్రక్రియ వేగవంతం కానుంది. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తమ పరిధిలో 550 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఇంటర్వ్యూలు లేకుండా కేవలం రాతపరీక్ష మార్కుల ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేసేందుకు త్వరలోనే కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని వర్సిటీ వైస్ ఛాన్సలర్ జానయ్య తెలిపారు. మరోవైపు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఇప్పటికే 140 పోస్టుల (79 అసిస్టెంట్ ప్రొఫెసర్, 44 అసోసియేట్ ప్రొఫెసర్, 17 ప్రొఫెసర్) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆ ప్రక్రియలో కూడా ఇంటర్వ్యూలను మినహాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో బ్యాక్‌లాగ్, కొత్త ఖాళీలతో కలిపి మొత్తం 294 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు కూడా కొత్త నిబంధనే వర్తిస్తుంది.

**అభ్యర్థులు, విద్యావేత్తల హర్షం**

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నిరుద్యోగ అభ్యర్థుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇంటర్వ్యూల పేరుతో జరిగే అవకతవకలకు, సిఫార్సులకు చెక్ పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు లభించే అవకాశం కలగడం వల్ల గ్రామీణ, పేద నేపథ్యం ఉన్న అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు సైతం అభిప్రాయపడుతున్నారు. సంబంధిత విశ్వవిద్యాలయాల బోర్డులు త్వరలోనే ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి సిలబస్, పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి.

## అమెరికాలో దారుణం.. 16 మంది చిన్నారులను బంధించిన కుటుంబ సభ్యులు..

అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఈ ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్-డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం: కేంద్రమంత్రి

వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన గురువారం వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు. గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, డీజిల్ ధర రూ. 95.20 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

## మెడికల్, ఇంజినీరింగ్ అడ్మిషన్లలో బోర్డు ఎగ్జామ్ మార్కులకు వెయిటేజీ!

ప్రస్తుతం భారత్‌లో ఉన్న పోటీ పరీక్షల తీరుతెన్నులపై విమర్శలు పెరుగుతున్నాయి. పేపర్ లీకేజీ ఉదంతాలు, విపరీత పోటీతో విద్యార్థుల పై ఒత్తిడి, కోచింగ్ సెంటర్ల నిర్వాకాల నేపథ్యంలో పోటీ పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు జరగాలన్న డిమాండ్స్ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మెడికల్, ఇంజనీరింగ్ అడ్మిషన్లకు పోటీ పరీక్షల ర్యాంకుతో పాటు బోర్డు ఎగ్జామ్ మార్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న అంశాన్ని ప్రభుత్వ వర్గాలు పరిశీలిస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అడ్మిషన్ల సమయంలో బోర్డు ఎగ్జామ్ మార్కులకు ఏకంగా 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే అంశం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. 'బోర్డు ఎగ్జామ్ మార్కులకు 50 శాతం వెయిటేజీతో పాటు, పాఠశాల సిలబస్‌కు దగ్గరగా పోటీ పరీక్షల సిలబస్ కూర్పు వంటివి పరిశీలనలో ఉన్నాయి. కోచింగ్ సెంటర్లపై విద్యార్థులు ఆధారపడాల్సిన పరిస్థితిని తొలగించేలా ఈ ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. చివరకు ఆన్ డిమాండ్ కంటప్యూటర్ బేస్డ్ టెస్టుల దిశగా చర్చలు జరుగుతున్నాయి' అని సంబంధిత వర్గాలు తెలిపినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం పోటీ పరీక్షల్లో విద్యార్థుల మార్కుల ఆధారంగా మెడికల్, ఇంజినీరింగ్ కోర్సుల్లో సీట్ల కేటాయింపు జరుగుతోంది. బోర్డు పరీక్షల్లో నిర్ణీత క్వాలిఫయ్యింగ్ మార్కులు సాధించిన వారు అడ్మిషన్లకు అర్హులు. ఇక కోచింగ్ సెంటర్ల ప్రాబల్యం, డమ్మీ స్కూల్స్ సమస్యను పరిష్కరించేందుకు గతేడాది విద్యాశాఖ ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటైంది. బోర్డు ఎగ్జామ్స్ వెయిటేజీ అంశాన్ని ఈ కమిటీ పరిశీలిస్తోందని సమాచారం. మరికొన్ని వారాల్లో ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది.

## చర్చకు పిలిచి మొహం చాటేశారు: మంత్రి జూపల్లి పై హరీశ్ రావు ఫైర్

**చర్చకు పిలిచి మంత్రి జూపల్లి రాలేదని హరీశ్ రావు విమర్శలు**
**తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నేతలు, గైర్హాజరైన మంత్రులు**
**గన్ పార్క్ వద్దకు వెళ్తుండగా హరీశ్ రావు, ఇతర నేతల అరెస్ట్**
**ఖాళీ కుర్చీతో జూపల్లి కోసం కేటీఆర్ ఎదురుచూపులు**
**టెండర్లు, అప్పులపై చర్చకు కాంగ్రెస్ భయపడుతోందన్న బీఆర్ఎస్**



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు తీవ్రరూపం దాల్చింది. గురుకుల పాఠశాలల టెండర్లు, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తీరా సమయం వచ్చేసరికి వెనకడుగు వేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం చర్చ కోసం తాము తెలంగాణ భవన్‌కు చేరుకున్నా, మంత్రి రాకపోవడంపై ఆయన మండిపడ్డారు. గురువారం హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గన్ పార్క్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వారు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. "చర్చకు రమ్మని సవాల్ విసిరింది వాళ్లే, తీరా మేము వస్తే పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం చూస్తుంటే, టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే వారు పారిపోయారని స్పష్టమవుతోంది" అని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పు రూ. 8 లక్షల కోట్ల నుంచి రూ. 7 లక్షల కోట్లకు ఎలా తగ్గిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ఖాళీ కుర్చీ వేసి వేచి చూశారు. పోలీసుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులపాలైందని, భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకున్నారు.

# యాదగిరి గుట్ట ట్రస్ట్ బోర్డు నియామకంపై విమర్శల వెల్లువ





**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రముఖులే లేరా?**

**విదేశీపర్యటనలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**దేవాదాయ శాఖ మంత్రికి తెలియకుండా ట్రస్ట్ బోర్డు నియమించారా?**

**బీఆరెస్ హయాంలో పునర్నిర్మాణం!కులాలపరం గా కూడా సామాజిక సమతూకమేది?**

**తిరుమల ట్రస్ట్‌బోర్డులో ప్రాంతాలు, కులాల వారీగా సముచిత స్థానాలు!**

యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డు నియామకంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజా ప్రతినిధుల్లో ఒక్కరికి కూడా అవకాశం దక్కకపోవడాన్ని పలువురు తప్పుపడుతుంటే సామాజిక తూకమేదని మరికొందరు నిలదీస్తున్నారు.

**ట్రస్టు బోర్డు నియామకం విషయంలో పెద్ద ఎత్తున విమర్శలు?**

యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డు నియామకం విషయంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణం తరువాత తొలిసారి రెండు సంవత్సరాల కాల పరిమితితో పాలక మండలిని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఒక్క ప్రజా ప్రతినిధికి కూడా అవకాశం ఇవ్వకపోవడం ప్రధానంగా చర్చనీయాంశమైంది. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్యను సభ్యుడిగా నియమించకపోవడంపై ఆయన అనుచరులు అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు ఇప్పటికే విప్ పదవి ఇచ్చినందున భువనగిరి లేదా మునుగోడు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తే బాగుండేదనే వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. కనీసం ఉమ్మడి వరంగల్ లేదా మెదక్ జిల్లా నుంచి ప్రజా ప్రతినిధులకు అవకాశం కల్పించకపోవడం శోచనీయమంటున్నారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారని తెలుస్తున్నది. ఈ సమయంలో తెలంగాణలోనే ప్రముఖ దేవాలయానికి పాలక మండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో ఆమెను సంప్రదించే నిర్ణయం తీసుకున్నారా? లేక ఆమె ప్రమేయం లేకుండానే ఉత్తర్వులు ఇచ్చారా? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో గట్టిగానే వినిపిస్తున్నది.

**కులాల పరంగా కూడా సామాజిక సమతూకమేది?**

బీఆరెస్ హయాంలో పునర్నిర్మాణం కులాల పరంగా కూడా సమ తూకం పాటించలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పైపెచ్చు బీజేపీ నాయకుడికి అవకాశం ఇవ్వడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని జరిగిన తప్పిదాన్ని సరిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో సభ్యులను పెంచాలని భక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఏపీలోని టీటీడీ బోర్డులో దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖులకు చోటు కల్పించి సముచిత అవకాశం కల్పిస్తున్నారని, అదే తరహాలో తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి పొందిన యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డులోనూ పాటించాలనే డిమాండ్ ఊపందుకుంటున్నది. యాదగిరి గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పునర్నిర్మాణం చేశారు. సిమెంట్, ఇటుకలను వినియోగించకుండా పూర్తిగా కృష్ణ శిలలతో, అద్భుతమైన శిల్పకళా నైపుణ్యం, నిపుణులైన స్తపతులతో ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. పునర్నిర్మాణం ముందు, తరువాతి ఆదాయంతో పోల్చితే ఎంతో వ్యత్యాసం ఉంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ఆదాయం కూడా అంతే స్థాయిలో లభిస్తున్నది. 2022 నవంబర్ 13వ తేదీన రికార్డు స్థాయిలో రూ.1.9 కోట్ల ఆదాయం వచ్చింది. అదే నెల 30వ తేదీన కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో 80వేల మంది భక్తులు సందర్శించుకున్నారు. భక్తుల కైంకర్యాలు, ప్రసాదాలు, వ్రతాలు, సుప్రభాత సేవలు, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.1.16 కోట్లు ఆదాయం సమకూరింది. ఎందరో దాతలు ఇచ్చిన బంగారం, రూ.1,800 కోట్ల ప్రభుత్వ నిధులతో యాదగిరిగుట్ట దేవాలయాన్ని నిర్మాణం చేశారు. పునర్నిర్మాణంలో ప్రధాన స్తపతి, 11 మంది ఉప స్తపతులు, రెండు వేల మంది శిల్పులు పనిచేయగా శిల్పులలో తెలంగాణ తమిళనాడు, ఏపీ రాష్ట్రాల వారు కూడా ఉన్నారు. ప్రపంచంలోనే మొదటి రాతి దేవాలయంగా లక్ష్మీ నరసింహ స్వామి గుడి నిర్మితమైంది. గతంలో ఒక ఎకరంలో మాత్రమే ఉన్న ఆలయ ప్రాంగణాన్ని 14.5 ఎకరాల్లో నిర్మాణం చేసి 2022 మార్చి నెలలో పున ప్రారంభించారు. ఉద్ఘాటన తరువాత ఆలయానికి భక్తుల తాకిడి పెరగడమే కాకుండా సెలవు రోజులలో 50వేల మందికి పైగా భక్తులు సందర్శించి, పలు కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డును నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే నిర్ణయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రస్టు బోర్డు సభ్యులను నియమించకుండా ఎగ్జిక్యూటివ్ అధికారి, అనువంశిక ధర్మకర్తతోనే కొనసాగిస్తున్నారు. అయితే రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్‌గా మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సత్యనారాయణ రెడ్డిని నియమించారు. సభ్యులుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం వినోద్ వెంకటస్వామి, నటుడు చిరంజీవి భార్య కొణిదెల సురేఖ, విజయక్రాంతి దినపత్రిక యజమాని భార్య చిలప్పగారి విజయరాజం, తూళ్ల విజయేందర్ గౌడ్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంఠమనేని, ఎం రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్‌తో పాటు అనువంశిక ధర్మకర్త ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరు కాకుండా ఎక్స్ అఫిషియో మెంబర్లుగా మరో ఆరుగురు ఉన్నారు. ఆరుగురిలో ఐదుగురు ప్రభుత్వ ఉన్నతాధికారులు కాగా ఒకరు ప్రధాన అర్చక స్థానాచార్యుడు.

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆధ్యాత్మిక చింతన కలిగిన ప్రముఖులే లేరా?**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆధ్యాత్మిక చింతన కలిగిన వారు ఎంతో మంది పెద్దలు, రాజకీయ కురువృద్ధులు ఉన్నారు. సినిమా రంగంలో తెలంగాణ నుంచి పేరు పొందిన నటులు, దర్శకులు, నిర్మాతలు ఉన్నారు. నితిన్, విజయ్ దేవరకొండలకు ప్రేక్షక ఆదరణతో పాటు ప్రజల్లో మంచి గుర్తింపు కూడా ఉంది. బీసీ సామాజిక వర్గంలో యాదవ, గౌడ కులం వాళ్లు తప్ప మరే ఇతర కులస్తులు కన్పించడం లేదా? అనే విమర్శలు మొదలయ్యాయి ప్రముఖ కంపెనీ ఎంఎస్ఎన్ గ్రూపు అధినేత మన్నె సత్యనారాయణ రెడ్డి, మాజీ బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి సోదరుడు కాగా, విజయేందర్ గౌడ్ మాజీ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ కుమారుడు. నాట్కో ఫార్మాకు చెందిన ట్రస్టులో కాంతామణి స్వాతి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ట్రస్టు బోర్డులోని పది మంది నామినేటెడ్ సభ్యులలో ఓసీలు ఆరుగురు, ఒకరు మాల (ఎస్సీ), ఒకరు గౌడ (బీసీ), ఒకరు యాదవ (బీసీ), ఒకరు లంబాడ (ఎస్టీ) చొప్పున ఉన్నారు. ఇదిలా ఉంటే పాలక మండలి కూర్పుపై పెద్ద ఎత్తున భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేమీ పాలక మండలి అంటూ అటూ కాంగ్రెస్ నాయకులు, ఇటు భక్తులు పెదవి విరుస్తున్నారు. తెలంగాణ తిరుమల గా పేరొందిన యాదగిరిగుట్ట నరసింహ స్వామికి సేవ చేసుకునే భాగ్యం కల్పించారా అంటూ ఆక్షేపిస్తున్నారు.


**తిరుమల ట్రస్ట్‌బోర్డులో ప్రాంతాలు, కులాల వారీగా సముచిత స్థానాలు**

ఏపీ ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత 2024 అక్టోబర్ లో టీటీడీ నూతన పాలక మండలి ని ఏర్పాటు చేశారు. ప్రముఖ దివ్యక్షేత్రం అయిన టీటీడీ పాలక మండలి ఏర్పాటులో కులాలు, రాష్ట్రాలు, తెలంగాణకు సముచిత ప్రాధాన్యం కల్పించారు. ఛైర్మన్ తో కలిపి మొత్తం 24 మంది కాగా ఇందులో ఏపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు, తెలంగాణ నుంలచి ఐదుగురు, కర్నాటక నుంచి ముగ్గురు, తమిళనాడు నుంచి ఇద్దరు, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఒక్కొక్కరి చొప్పున బోర్డులో అవకాశం కల్పించారు. తెలంగాణ నుంచి అవకాశం పొందిన వారిలో నన్నూరి నర్సిరెడ్డి, బొంగునూరు మహేందర్ రెడ్డి, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్ల, అనుగోలు రంగశ్రీ, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద సాయికి చోటు లభించింది. టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ ప్రకారంగా ప్రాంతాలు, కులాల వారీగా సమతూకం పాటించడంలో విఫలమైనట్లు తాజా ఉత్తర్వుల్లో స్పష్టమవుతోంది ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఒక్క ప్రజా ప్రతినిధికి కూడా అవకాశం కల్పించకపోవడం జిల్లా ప్రజలను మరింత ఆగ్రహానికి గురి చేస్తున్నది. మా జిల్లా దేవుడికి సేవ చేసుకుని, భక్తులకు సిఫారసు లేఖలు ఇచ్చుకునే భాగ్యం లేదా అంటూ మండి పడుతున్నారు. జిల్లా లో ఎందరో హేమాహేమీ రాజకీయ నాయకులు, ధాతృత్వ గుణం కలిగిన పెద్దలు ఉన్నా వారికి చోటివ్వకపోవడం శోచనీయం అంటున్నారు. తెలంగాణ చారిటబుల్, హిందూ రిలిజియస్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ (అమెండ్ మెంట్) యాక్టు, 2025కు మరోసారి సవరణలు తెచ్చి సభ్యుల సంఖ్యను పెంచాలని భక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి వాసులకు కచ్చితంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

**విదేశీ పర్యటనలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొద్ది రోజులుగా విదేశీ పర్యటనలో ఉన్నారు. సచివాలయ వర్గాల సమాచారం ప్రకారం గురువారం రాష్ట్రానికి వస్తున్నట్లు తెలిసింది. తెలంగాణలోనే ప్రముఖ దేవాలయం అయిన యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్టు బోర్డు నియామకం సమయంలో ఆమె లేకపోవడం పలు అనుమానాలకు తెరతీస్తున్నది. విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో నియమించడం వెనకాల ఏమైనా కారణాలు ఉండవచ్చని, పాలక మండలిని చూస్తే స్పష్టమవుతుందనే చర్చ సచివాలయంలో జరుగుతోంది. ఈ పాలక మండలికి ఆమె ఆమోదం ఉన్నా, రాష్ట్రంలో ఉన్న సమయంలో ఉత్తర్వులు జారీ చేస్తే గౌరవప్రదంగా ఉండేదని గాంధీ భవన్ వర్గాలు అనుకుంటున్నాయి. ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీర్ల అయిలయ్య తో పాటు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఒక అడుగు ముందుకు వేసిన రాజగోపాల్ రెడ్డి బుధవారం నాడు తన ఆగ్రహం, ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల వ్యవహారం బాగా లేదని, పీసీసీ అధ్యక్షుడు బీ మహేష్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛ‌ఆర్జీ మీనాక్షీ నటరాజన్ కు కలిసి వివరిస్తానని అన్నారు. హైదరాబాద్ లో కూర్చుని ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే ఎలా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కోసం మొదటి నుంచి కొట్లాడిన కాంగ్రెస్ వాదులకు విలువ లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లతోనే అంతా నడుస్తోందని, సీనియర్లను గౌరవించడం లేదన్నారు. ప్రభుత్వం అనేది ప్రజల కోసం పనిచేయాలని, హంగామాలు చేయడం కాదని హితవు పలికారు. ట్రస్టు బోర్డు నియామకంపై ముందే చెబితే నేను పేర్లు ప్రతిపాదించేవాడినని, ఇలాగా అగౌరవ పరుస్తుంటే ముందుకు వెళ్ళలేమని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# దైవం,ధర్మం,రాజ్యాంగం-భారతదేశాన్ని నడిపేది ఏది...?




భారతదేశం అనగానే మనకు గుర్తుకు వచ్చేవి ఎన్నో వాదాలు, మరెన్నో నినాదాలు.అందులో "జై శ్రీరామ్,జై హింద్,భారత్ మాతాకీ జై" వంటి నినాదాలు కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తిని,ఆధ్యాత్మిక భావనను,సాంస్కృతిక గౌరవాన్ని ప్రతిబింబిస్తాయి.వీటిని గౌరవించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది.కానీ,ఈ నినాదాలు అనాలని బలవంతం చేసే అధికారం ఎవరికీ లేదు. ఎందుకంటే భారత రాజ్యాంగం ఈ దేశాన్ని లౌకిక (సెక్యూలర్) గణతంత్రంగా నిర్వచించింది. అంటే...ప్రభుత్వం ఏ ఒక్క మతానికీ చెందదు,అన్ని మతాలను సమానంగా గౌరవించాలి. భారతదేశంలో మెజారిటీ ప్రజలు హిందూ మతాన్ని అనుసరించడం వల్ల పలు సాంస్కృతిక సంప్రదాయాలు ప్రభుత్వ వ్యవస్థల్లో కూడా కనిపించడం సహజమే. అయితే ఒక దేశ పరిపాలనకు అసలు ఆధారం మతం కాదు, రాజ్యాంగం. ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించడం,చట్టాన్ని సమానంగా అమలు చేయడం, న్యాయాన్ని కాపాడడం ప్రజాస్వామ్య ప్రభుత్వ ప్రధాన బాధ్యత. కానీ,నేటి రాజకీయాల్లో మతం,కులం,ప్రాంతం వంటి అంశాలు తరచూ ఎన్నికల రాజకీయాల్లో ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. ప్రజల మధ్య ఉన్న విశ్వాసాలను రాజకీయ లాభాల కోసం వినియోగించడం ప్రజాస్వా మ్యానికి మేలు చేయదు. ప్రజల భావోద్వేగాలను గౌరవించడం ఒకటి అయితే, వాటిని అధికార సాధనానికి ఉపయోగించడం మరో విషయం.ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం ప్రతి పౌరుడి బాధ్యత.అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం దేశ చరిత్రలో ఒక కీలక ఘట్టం.అది సుదీర్ఘ న్యాయ ప్రక్రియ అనంతరం భారత సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా జరిగింది.ఇది ప్రజాస్వామ్యంలో వివాదాలకు తుది పరిష్కారం చట్టబద్ధమైన సంస్థల ద్వారానే వస్తుందని చూపించింది.అదే సమయంలో ఏ ఆలయం అయినా, ఏ మత సంస్థ అయినా,అక్కడ ఆర్థిక అవకతవకలు లేదా పరిపాలనా లోపాలపై ఆరోపణలు వస్తే వాటిని కూడా చట్ట ప్రకారమే విచారించాలి.మతపరమైన గౌరవం ఒకటి,ప్రజా ధనం లేదా ప్రజా విశ్వాసం దుర్వినియోగం జరిగిందా లేదా అన్నది మరో అంశం. భగవంతుడిపై విశ్వాసం వ్యక్తిగతమైనది.కానీ,నేరాలను అరికట్టడం,అవినీతిని నిరోధించడం, న్యాయం చేయడం మనుషులు రూపొందించిన చట్టవ్యవస్థ బాధ్యత.అందుకే పోలీసులు,దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు పనిచేస్తాయి. సమాజంలో దొంగత నాలు, అవినీతి, హత్యలు,అత్యాచారాలు లేదా ఇతర నేరాలు జరగకుండా చూడ డం ప్రభుత్వ సంస్థల బాధ్యత.నేరం జరిగితే దానిపై చట్టపరమైన చర్యలు తీసుకో వడం కూడా వాటి బాధ్యతే.చరిత్ర చెబుతోంది... ఏ మతం కూడా మనుషుల మధ్య ద్వేషం పెంచడానికి పుట్టలేదు.హిందూ, ఇస్లాం,క్రైస్తవం,సిక్కు,బౌద్ధం,జైనం ప్రతి మతం కూడా నైతిక విలువలు,పరస్పర గౌరవం, సత్యం, దయ,సేవ వంటి అంశాలనే బోధిస్తుంది.సమస్య మతంలో కాదు,మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించే విధానంలో ఉంది.ఈ దేశ భవిష్యత్తు బలపడాలంటే పౌరులు ముందుగా భారతీయులమనే భావనను బలపరచాలి.మతం వ్యక్తిగత విశ్వాసంగా ఉండాలి. పరిపాలన మాత్రం రాజ్యాంగ సూత్రాల ప్రకారం సాగాలి. చట్టం ముందు అందరూ సమానులనే సూత్రం అమలులో ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజలు కూడా నాయకులను కేవలం మతం, కులం,భావోద్వేగాల ఆధారంగా కాకుండా వారి పాలన, నిజాయితీ, అభివృద్ధి,ప్రజా సంక్షేమం ఆధారంగా అంచనా వేయాలి. ప్రశ్నించే సంస్కృతి, బాధ్యతాయుతమైన ఓటు, పారదర్శక పాలన...ఇవే బలమైన భారతదేశానికి పునాదులు.చివరగా ఒక్క విషయం...భారతదేశాన్ని శాశ్వతంగా నిలబెట్టేది ఒక్క నినాదం కాదు,ఒక్క మతం కాదు,ఒక్క రాజకీయ పార్టీ కాదు.ఈ దేశాన్ని నిలబెట్టేది రాజ్యాంగం,చట్ట పరిపాలన,ప్రజల ఐక్యత,పరస్పర గౌరవం, నిజాయితీతో కూడిన ప్రజాస్వామ్య విలువలు.మతం మనిషికి మార్గదర్శకం కావచ్చు. కానీ,దేశాన్ని నడిపించేది రాజ్యాంగమే.రాజ్యాంగాన్ని గౌరవిస్తూ,అన్ని మతాలను గౌరవిస్తూ,ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టిన పాలన సాగినప్పుడే సమానత్వం, న్యాయం, అభివృద్ధితో కూడిన భారతదేశం నిర్మాణం సాధ్యమవు తుంది.మతం పేరుతో రాజకీ యాలు కాదు,రాజ్యాంగం పేరుతో పరిపాలనే దేశానికి శ్రేయస్కరం.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
శుక్రవారం 3 జూలై 2026

# గురువారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

( జూలై - 2- హంస కలంవార్త )





క్యాంపు కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ పై కూకట్ పల్లి మరియు శేర్లింగంపల్లి నియోజకవర్గం సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఇందులో ప్రధానంగా ఆయన మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ జరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని ..ఈ విషయంలో బి .ఆర్. ఎస్ పార్టీ తరపున దీూూ అందరూ కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు కూడా దీనిపై పూర్తి అవగాహన లేని కారణంగా ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారని ..దీనిపై పూర్తి సమాచారం ప్రజలకు చేరవేయగా మనం కూడా అందుబాటులో ఉండి అనుమానాలు నివృత్తి చేయాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు.. ముఖ్యంగా ఓటు ఉండి ఎవరైనా అందుబాటులో లేనియెడల తిరిగి మళ్లీ వారికి బి.ఎల్.ఓ లను అందుబాటులోకి తీసుకెళ్లి తమ ఓటు హక్కు పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు ..ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి, శేర్లింగంపల్లి నియోజకవర్గం బి.ఎల్.ఎ లు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

## ఏవి.బి పురం రోడ్ నంబర్-11 లో డ్రైనేజీ మరియు వాటర్ లైన్ వేయాలని వినతి పత్రం ఇచ్చిన జనసేన నాయకులు, కాలనీ వాసులు.



( జూలై - 2- హంస కలంవార్త )

కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కాంటెస్ట్ డ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ సూచనలు మేరకు భారత్ నగర్ లోని వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ మేనేజర్ సయ్యద్ అబుదుల్ జాకే ను కలిసిన ఏ.వి.బి పురం ప్రెసిడెంట్ సీమాద్రి, జనసేన నాయకులు, కాలనీ వాసులు తమ కాలనీ లో సుమారు వంద మంది నివసిస్తున్న రోడ్ నంబర్-1 లో డ్రేనేజ్ మరియు వాటర్ సౌకర్యం లేదని అచ్చట నివసిస్తున్న కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారు అని వెంటనే వాటర్ మరియు డ్రైనేజీ సమస్యని పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందించారు. వెంటనే స్పందించిన వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ ఏవిబి పురం రోడ్ నంబర్- 11 కి వచ్చి అక్కడ ఇబ్బంది పడుతున్న కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వారి తక్షణ స్పందనకు ప్రేమ కుమార్, కాలనీ వాసులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, టి. ప్రసాద్,దుర్యోధన,మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీలో

( జూలై - 2- హంస కలంవార్త )



ఉన్న సమస్యలు మరియు కాలానికి రావడానికి దారి కూడా లేకుండా గత ప్రభుత్వము లో అడ్డంగా నిర్మించిన వాణిజ్య సముదాయములతో కాలని వాసులు ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని .ప్రపంచము లో ఎక్కడ లెని ఫ్రీ టర్న్ వద్ద నో యూ టర్న్ అనే బోర్డ్ పెట్టిన సంగతి పేరు ఉన్న ప్రతి ప్రతి న్యూస్ పేపర్ లో ప్రచురితము అయిన సందర్భంగా ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు గానీ అప్పటి +ఎవీజ ఇప్పటి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్ళి నా నో యూ టర్న్ బోర్డు తీయని చందంగా ఉందని గాంధి భవన్ లో తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు కి వినతి పత్రము అందచేసిన కాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి మరియు కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్, నాగేశ్వర్ రావు బాబు,నరేష్ కుమార్, మధుకర్, వెంకటేష్, బిక్షపతి గౌడ్ లు పాల్గొన్నారు

## కాంగ్రెస్ కూకట్‌పల్లి కెపిహెచ్‌బి డివిజన్ ప్రెసిడెంట్‌గా దెంది అరవింద్ రెడ్డి నియామకం

( జూలై - 2- హంస కలంవార్త )



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ బి. మహేష్ కుమార్ గౌడ్ , కూకట్‌పల్లి ఇంచార్జి కమ్మ కార్పొరేషన్ అధ్యక్షుడు బండి రమేష్ అధ్యక్షతన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ తోటకూర వజ్రేష్ యాదవ్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ల ప్రెసిడెంట్ల నియామకాలను ఖరారు చేశారు. ఈ నియామకాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీ (డివిజన్ నెం. 252) ప్రెసిడెంట్‌గా దెంది అరవింద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ నియామకాలు తక్షణమే అమలుల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.కొత్తగా నియమితులైన డివిజన్ ప్రెసిడెంట్లు అందరూ క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి శ్రమించాలని మరియు సంస్థాగత నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలని బి. మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం

( జూలై - 2- హంస కలంవార్త )

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి లో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను సి ఎం సి ఇంజనీరింగ్ ,టౌన్ ప్లానింగ్. ఎలక్ట్రికల్ విభాగం అధికారులు తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పరిశీలించిన గ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ . ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని ,ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని ,దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై గతంలో అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగిన సంగతి విదితమే అని గాంధీ తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు



విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళ ను తొలగించడం జరుగుతుంది అని,రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగినది అని గాంధీ గారు తెలియచేసారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం జరిగినది అని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,



ప్రజలకు రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది అని గాంధీ గారు చెప్పడం జరిగినది. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగినది అని,ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# రంగారెడ్డి జిల్లా (అర్బన్) బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా సీతారామరాజు నియామకం

( జూలై - 2- హంస కలంవార్త )

రంగారెడ్డి జిల్లా (అర్బన్) భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా సీతారామరాజు నియమితులైన సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వద్దేపల్లి రాజేశ్వరరావు ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వద్దేపల్లి రాజేశ్వరరావు సీతారామరాజు ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓబీసీ వర్గాల



అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఓబీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాధాన్యత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, పార్టీ బాధ్యతలను స్వీకరించిన సీతారామరాజు ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరయ్య చారి, గోపాల్ రావు, అక్కినపల్లి సాయి, నర్సింగ్, శివా చారి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

( జూలై - 2- హంస కలంవార్త )

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజీపురి కాలనీలో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు కొలుకుల జగన్ మంత్రి సత్యనారాయణ. సురేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజే శారు. తెలంగాణ సాంప్రదాయంలో ముఖ్యంగా హైదరాబాద్ సంస్కృతిలో బోనాల ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. భగవంతుని పూజించడం



వలన క్రమశిక్షణ తో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన కమిటీ సభ్యులకు మరోసారి అభినందనలు తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు. అరుణ్ రెడ్డి.. ప్రవీణ్ కుమార్ గుప్తా. శ్రీనివాస్. బాలు. శ్రీకాంత్ రెడ్డి.ఉపేందర్ రెడ్డి. బాబు. భాస్కర్. సునీల్ రెడ్డి సంపత్ రెడ్డి. బసవేశ్వర్. తదితరులు పాల్గొన్నారు.




# నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడాలని భారీ నిరసన కార్యక్రమం

**--విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, మేధావుల ఐక్య గళం.**

( జూలై - 2- హంస కలంవార్త )

నాంపల్లి ప్రాంగణంలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ గురువారం రోజు విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, సాహితీ--సాంస్కృతిక వర్గాలకు చెందిన ప్రముఖులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు తదితరులు పాల్గొని ప్రభుత్వం ఇప్పటికే ఆద్యకళకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించిన మళ్లీ తిరుమలరావు,కోదండరాం ఎ ముఖం పెట్టుకోని తెలుగు విశ్వవిద్యాలయంలో కాలు మోపారని ప్రశ్నించారు. తెలుగు విశ్వవిద్యాలయ స్థలాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం సమంజసం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ విశ్వవిద్యాలయాన్ని బలహీనపరిచే చర్యలను వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోనే కొనసాగాలని, ఇప్పటికే ఆద్యకళ ఆధీనంలో ఉన్న పాత వస్తువులు, సామగ్రిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తగిన మ్యూజియంకు తరలించాలని సూచించారు. ఆద్యకళ వారసత్వంపై నిజమైన అభిమానం ఉంటే, ఆ వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యేక మ్యూజియంలో భద్రపరచడం ఉత్తమ మార్గమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో జ్యోతిష్యం, యోగా, బి.డిజైన్, పద్యనాటకం, దూరవిద్యతో పాటు పలు కోర్సుల్లో 2,500 మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, ప్రస్తుతం ఉన్న తరగతి గదులే సరిపోని పరిస్థితి ఉందని వక్తలు పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో మరిన్ని గదులను ఇతర అవసరాలకు కేటాయించడం వల్ల విద్యార్థుల విద్యా కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆద్యకళ ఆధీనంలో ఉన్న గదులను తిరిగి విశ్వవిద్యాలయానికి అప్పగించి, విద్యార్థుల అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్నవారు "తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడాలి" "నాంపల్లి ప్రాంగణాన్ని యథాతథంగా కొనసాగించాలి" "విద్యార్థుల హక్కులను పరిరక్షించాలి" అంటూ నినాదాలు చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆటంకం కలిగించే నిర్ణయాలను పునఃసమీక్షించి, విద్యార్థుల భవిష్యత్తు, తెలుగు భాషా--సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అమృత్ 2.0 అభివృద్ధి పనులను పరిశీలించిన స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్



హంస కలంవార్త జూలై 2జగిత్యాల:

రాయికల్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న అమృత్ 2.0 అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) బి. రాజగౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, చిల్డ్రన్స్ పార్కును సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. పార్కు అభివృద్ధి పనులు నిర్దేశిత వేగంతో కొనసాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, పనులు ఆలస్యం చేసిన సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పట్టణంలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ ప్రజలు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



హంస కలంవార్త జులై 02 రామగుండం:

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం శాలపల్లిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిల్లులు విడుదల కాకపోవడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లులను విడుదల చేసి నిర్మాణ పనులను మళ్లీ ప్రారంభించామని చెప్పారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి అర్హులైన పేద కుటుంబాలకు ఇండ్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విద్యుత్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే ఇండ్లకు నాణ్యమైన రంగులు వేయాలని సూచిస్తూ, ఇళ్లు అందంగా కనిపించేలా పెయింటింగ్ చేయాలి. నాసిరకం రంగులతో బూత్ బంగ్లాల్లా కనిపించేలా చేయొద్దు అని కాంట్రాక్టర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. పేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




హంస కలంవార్త జూలై 02 నిర్మల్ జిల్లా ప్రతినిధి

రేపటి దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకో వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశిం చారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం కలెక్టర్ దిశ కమిటీ సమావేశ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సంబంధిత ప్రజాప్రతినిధులందరికీ దిశ కమిటీ సమావేశానికి సమాచారం ఇవ్వాలని అన్నారు.ప్రతి అధికారి వారి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు,అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి వివరాల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు నివేదికలు పారదర్శకంగా ఉండాలన్నారు.ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పథకాల వివరాలను సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్,డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి -- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

-ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

హంస కలంవార్త జూలై 2జగిత్యాల:

మెట్పల్లి అర్బన్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న హెల్త్ సెంటర్‌తో పాటు కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట వద్ద నిర్మిస్తున్న హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం,



ప్రహరీ, రహదారి వంటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు చేరేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. మెట్పల్లి పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు తప్పనిసరిగా నమోదు అయ్యేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవసరమైన మార్గద ర్శకాలు అందిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు కల్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీఓలు నరసింహారావు, జీవాకర్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సుజాత, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంస కలంవార్త మంచిర్యాల జిల్లా ప్రతినిధి :

ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలం మద్దికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల తహసిల్దార్ సదానందం తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు,మోకా,పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం



జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతర మవుతుందని,మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. సర్వే యర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలల్లోని తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలలకు పంపించేలా ఉపాధ్యా యులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యా యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విద్యార్థులు గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్, పైపు లైన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి సందర్శించారు. ప్రజలకు నిరంతరంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

-బీఎల్ఓ లు ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి..

-పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలి..

-వైరా పట్టణం, పల్లిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..

హంస కలంవార్త జూలై 2 ఖమ్మం

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది కావడంతో ప్రతి వివరాన్ని అత్యంత బాధ్యతతో నమోదు చేయాలని సూచించారు. గురువారం వైరా పట్టణంతో పాటు కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరు, నింపిన ఫారాలను స్వీకరిస్తున్న విధానం, ఓటర్ల వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు ఇళ్లను సందర్శించిన కలెక్టర్ ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను తెలుసుకుని నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రతి బీఎల్ఓ తప్పనిసరిగా బీఎల్ఓ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే వివరాలను నమోదు చేయాలని, సమాచార నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ నిష్పాక్షికంగా, పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓ రోజువారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాలని, అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారాలు పంపిణీ చేసే సమయ ంలోనే ఓటర్లకు ఎదురయ్యే సందేహాలు, అపోహలను నివృత్తి చేసి, అవసరమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్లలో ఎలాంటి భయాందోళనలు లేదా అపోహలకు తావులేకుండా చైతన్యం కల్పించడం



బీఎల్ఓల ముఖ్య బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అర్హ ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసి, పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి అందజేసి ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో బాధ్యతా యుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా భాగస్వాములు కావాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట కొణిజర్ల తహసీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమిషనర్ రామచందర్ రావు, సూపర్వైజర్లు, బీఎల్ఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

-మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి..

-కొణిజెర్ల మండలం పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్..

హంస కలంవార్త జూలై 2 ఖమ్మం

ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు చదువు మీద శ్రద్ధ చూపెడతారనీ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొణిజెర్ల మండలం పల్లిపాడు గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తరగతి గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, వంటగది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలిం చారు. భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం గుడ్డు, వెజిటబుల్ బిర్యానీ, పప్పు, సాంబారు అందిస్తు న్నారా, ఆహారం పరి శుభ్రంగా తయా రవుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థుల తో మాట్లాడి వారి అభిప్రాయా లను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, నాణ్యత విషయంలో ఎలాంటి



రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించాలని, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి తాజా కూరగాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజెర్ల తహసీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమీషనర్ రామచందర్ రావు, ఎంఈవో చావా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి గ్రామానికి 1.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పరిశీలన బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్







-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ జిల్లాలోని బజార్హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి 1.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా డప్పు చప్పుళ్ళ మధ్య ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఈఈ శివరాం ను నిర్మాణ పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకొని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్నో ఏళ్లుగా తమ కల సాకారం అయినందుకు, తమ గ్రామానికి బ్రిడ్జి మంజూరు చేయడం పట్ల కలెక్టర్, ఎమ్మెల్యే లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ పరిశీలనలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, సర్పంచ్ ప్రియాంక, ఇతర అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి

-తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వినతి..

-గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి...

హంస కలంవార్త జూలై 2 ఖమ్మం



అశ్వారావుపేటనియోజకవర్గంలోని గిరిజన, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు.అశ్వారావుపేట నియోజకవర్గం పూర్తిగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతం కావడంతో ఇక్కడి విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యను అభ్యసించాలంటే ఇతర జిల్లాలు లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన అనేక మంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక సాంకేతిక విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తే అశ్వారావుపేటతో పాటు దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన, ఎస్సీ, బీసీ, పేద కుటుంబాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన డిప్లొమా విద్య అందుబాటులోకి వస్తుందని చెప్పారు.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించేందుకు పాలిటెక్నిక్ విద్య ఎంతో కీలకమని, ప్రభుత్వం ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు అత్యవసరమని ఎమ్మెల్యే వివరించారు. కళాశాల ఏర్పాటుతో స్థానిక యువతకు సాంకేతిక విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు.ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి సానుకూలంగా పరిశీలించాలని ఎమ్మెల్యే కోరగా, ప్రభుత్వం అన్ని కోణాల్లో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సమావేశం అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు.అశ్వారావుపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు జరిగితే గిరిజన ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి కొత్త దిశగా నిలుస్తుందని, సాంకేతిక విద్య ద్వారా స్థానిక యువత ఉపాధి అవకాశాలను మరింత విస్తరించుకునే అవకాశం కలుగుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే 'ఆరోగ్య పాఠశాల' లక్ష్యం జిల్లా కలెక్టర్ రాజర్షిషా








-ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

హంస కలంవార్త ఆదిలాబాద్ జిల్లా ప్రదినిధి :

జిల్లా జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, విద్య,భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా'ఆరోగ్య పాఠశాల'కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపు నిచ్చారు. గురువారం బజార్హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల,కళాశాల లో నిర్వహించిన మూడవ విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభి ంచారు.ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, విద్యార్థులు ఆరోగ్య పాఠశాల లోని అంశాలపై పాటలు, నృత్యం,నాటిక రూపంలో అవగాహన కల్పించారు.సంబంధిత అధికారులు ఆరోగ్య పాఠశాల లోని ఆరు అంశాలపైన వ్యక్తిగత పరిశుభ్రత,పోషకాహారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, కాలానుగుణ వ్యాధుల నివారణ, వ్యక్తిత్వ వికాసం పై వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం,విద్య,భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతు ందన్నారు. గత రెండేళ్లుగా జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని, దీనికిగాను గతంలో జిల్లాకు అవార్డు లభించిందని గుర్తుచేశారు.ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల రక్షణకై 'పాక్సో చట్టం'పై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు, 'పాక్సో క్యాలెండర్' ను విడుదల చేసినట్లు తెలిపారు.విద్యార్థులు తమకు ఎదురయ్యే రకరకాల సమస్యలను నిర్భయంగా, గోప్యంగా చెప్పుకునేందుకు పాఠశాలల్లో 'ఫిర్యాదుల పెట్టెలను' ఏర్పాటు చేస్తున్నామని,వీటిని ప్రతి నెల ఒకటో తేదీన ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో తెరిచి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తమ సొంత ఖర్చులతో ఇంట్లోనే మరుగుదొడ్లు నిర్మించుకుని వాడాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించా లన్నారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను పెంచేందుకు దేశ ప్రముఖుల జీవిత చరిత్రలను ఇంగ్లీష్ పీరియడ్లలో విద్యార్థుల చేత చదివించాలని, అలాగే'ఖాన్ అకాడమీ' ద్వారా గణితం, సైన్స్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. ఈసారి జిల్లా నుండి ట్రిపుల్ ఐటీ బాసరాకు రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.బోథ్ శాసన సభ్యులు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుకు చదువుతో పాటు మంచి ఆరోగ్యం అత్యంతకీలకమని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్లో అడ్మిషన్ల డిమాండ్ ఎంతో పెరుగుతోందని, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య పాఠశాల,విద్యా క్యాలెండర్ మరెక్కడా లేదని,వారి సమర్థవంతమైన పనితీరు వల్ల ఆదిలాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో పలు అవార్డులు దక్కాయని కొనియాడారు. తల్లిదండ్రులు పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా మోడల్ స్కూల్ ఆవరణలో సీసీ రోడ్డు, బోర్వెల్ సదుపాయాన్ని త్వరలోనే కల్పిస్తామన్నారు. అలాగే గతంలో ఇబ్బంది పడిన కొత్తపల్లి గ్రామానికి సుమారు రూ. 1 కోటి నిధులతో బ్రిడ్జిని మంజూరు చేయించామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ,అన్ని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో సొంతంగా మంచినీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ. విద్యార్థుల పట్ల జిల్లా కలెక్టర్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా శాఖ బలోపేతానికి కృషి చేస్తున్నారని,ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. విద్యార్థులు వ్యసనాలు, చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా చదువు పట్ల శ్రద్ధ వహించి, ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఫాక్సో చట్టం-2012 క్యాలెండర్ ను కలెక్టర్, ఎమ్మెల్యే,చైర్మెన్ ఆవిష్కరి ంచారు. అనంతరం పోషకాహార తోటను ప్రారంభి ంచి, మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, ఏంఆర్వో శ్యామ్ సుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి,ఏంఈఓ రాంకిషన్, అకడమిక్ కో ఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్,స్థానిక సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారులు ఎన్ హెచ్ 563 & 63 పనులు వేగవంతం చేయాలి

-ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్

హంస కలంవార్త జూలై 2జగిత్యాల:



తెలంగాణ రవాణా మరియు రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ ఆధ్వర్యంలో హైద రాబాద్ సెక్రటరియేట్ నుండి ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్ హెచ్ 563 జగిత్యాల నుండి కరీంనగర్ మరియు ఎన్ హెచ్63 ఆర్మూర్ నుండి మంచిర్యాల వరకు పనుల వేగవంతం కోసం కరీంనగర్,జగిత్యాల జిల్లా కలెక్టర్లతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఆర్డీవో కోరుట్ల మెట్పల్లి మరియు జగిత్యాల, సంబం ధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

-రైతులకు అవసరమైన మేరకు సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి..

-యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేస్తున్న రైతులు..

హంస కలంవార్త జూలై 2 ఖమ్మం



వానాకాలం--2026 సీజన్కు సంబంధించి వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిం చిందని, జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 691.13 మెట్రిక్ టన్నులు (15,359 బస్తాలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 920.02 మెట్రిక్ టన్నులు (20,445 బస్తాలు), మార్క్ ఫెడ్ ఖమ్మం వద్ద 7,656.16 మెట్రిక్ టన్నులు (1,70,137 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991.51 మెట్రిక్ టన్నులు (22,034 బస్తాలు), కమీషనర్ రిజర్వ్ పూల్ (సీఆర్పీ)లో 6,898.05 మెట్రిక్ టన్నులు (1,53,290 బస్తాలు) నిల్వ ఉన్నాయని తెలిపారు. 2026 జూలై 2 నాటికి జిల్లాలో మొత్తం 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) అందుబాటులో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు 1,80,738 బస్తాలను బుక్ చేసుకొని, 1,60,316 బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని వివరించారు. రైతు సోదరులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని, రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రచురణార్థం నిర్ణిత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-వైరా కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో యంగ్ ఇండియాద ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం..

-విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన..

-వైరా నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

హంస కలంవార్త జూలై 2 ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా వైరా పట్టణంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల నమూనా మ్యాపులు, పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించా లన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌలిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.సమాజంలోని అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, సమాన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను నిర్మిస్తోందని పేర్కొన్నారు. సామర్థ్యం కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్యా వాతావరణాన్ని ఈ గురుకులాలు అంది స్తాయని అన్నారు.నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట వైరా తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ రామచందర్ రావు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రిజర్వ్ బ్యాంక్ సంచలన నివేదిక: దేశ ఆర్థిక వ్యవస్థకు ద్రవ్యోల్బణం కంటే పెను ముప్పుగా మారిన 'ఏఐ'!




దేశ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయ ముప్పులైన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల కంటే.. వేగంగా విస్తరిస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (కృత్రిమ మేధస్సు) సాంకేతికతే అత్యంత ప్రమాదకరంగా మారిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) హెచ్చరికలు జారీ చేసింది. ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన జూన్ 2026 నాటి 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్' (ఆర్థిక స్థిరత్వ నివేదిక)లో ఈ కీలక అంశాలను వెల్లడించింది. ఆర్థిక రంగంలో ఏఐ ప్రవేశం వల్ల పనితీరు మెరుగైనప్పటికీ, అదే స్థాయిలో వ్యవస్థ భద్రతకు ఇది ఒక పెద్ద సవాలుగా పరిణమించిందని ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఏఐ ఆధారిత సైబర్ దాడుల ముప్పు దేశంలోని ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థల అభిప్రాయాల ప్రకారం.. రాబోయే 12 నెలల్లో సంభవించే సైబర్ ముప్పులలో 'ఏఐ ఆధారిత సైబర్ దాడులే' అత్యంత ప్రమాదకరమైనవిగా మొదటి స్థానంలో నిలిచాయి. సాధారణ హ్యాకింగ్, రాన్సమ్‌వేర్, ఫిషింగ్ దాడుల కంటే.. ఏఐ సాయంతో సైబర్ నేరగాళ్లు చేసే దాడులు అత్యంత వేగంగా, సమర్థంగా, ఊహించని స్థాయిలో వ్యవస్థలను అతలాకుతలం చేసేలా ఉంటాయని నివేదిక స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించిన 'మైథోస్ రాన్సమ్‌వేర్' దాడిని ఇందుకు ఉదాహరణగా పేర్కొంది.

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కీలక ప్రకటన- ఆందోళనలపై పూర్తి క్లారిటీ



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్, త్వరలో తీసుకురానున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై నెలకొన్న ఆందోళనలపై స్పష్టతనిచ్చింది. ఈ ఫీచర్ పూర్తిగా ఐచ్ఛికమని, వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ అనేక జాగ్రత్తలు తీసుకున్నామని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ వెల్లడించింది. ఈ ఫీచర్ ద్వారా మోసాలు, నకిలీ ఖాతాల బెడద పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవడం, భారత ప్రభుత్వం కూడా దీనిపై వివరణ కోరడంతో వాట్సాప్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు భారత్‌లో ఈ ఫీచర్ ప్రారంభాన్ని వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్న వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న ఆందోళనలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు వాట్సాప్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పలు కీలక విషయాలను వెల్లడించింది. వినియోగదారులందరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ క్రియేట్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇది కేవలం అదనపు సౌకర్యం మాత్రమేనని, ఫోన్ నంబర్ ద్వారానే వాట్సాప్ వాడకాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. ముఖ్యంగా ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రభుత్వ సంస్థలు, అలాగే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఇప్పటికే వెరిఫైడ్ ఖాతాలు ఉన్నవారి యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసినట్లు వాట్సాప్ పేర్కొంది. అంటే.. ఆ పేర్లను కేవలం వారి అసలైన యజమానులు మాత్రమే క్లెయిమ్ చేసుకోగలరు. తద్వారా ఇతరులు వారి పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే అవకాశం ఉండదని భరోసా ఇచ్చింది. పాపులర్ పేర్లను ఎవరైనా రిజర్వ్ చేసుకోవచ్చని వస్తున్న వార్తల్లో నిజం లేదని కొట్టిపారేసింది. అపరిచితుల నుంచి రక్షణకు ప్రత్యేక ఫీచర్లు ఈ ఏడాది చివర్లో యూజర్‌నేమ్ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, అపరిచిత యూజర్‌నేమ్ నుంచి మెసేజ్ వస్తే వినియోగ ॅదారులకు కొన్ని అదనపు వివరాలు కనిపిస్తాయని వాట్సాప్ వివరించింది. సందేశం పంపిన వ్యక్తి ఏ దేశానికి చెందినవారు, వారి వాట్సాప్ ఖాతా కొత్తదా పాతదా, ఇద్దరికీ ఉమ్మడిగా ఏవైనా గ్రూపులు ఉన్నాయా వంటి సమాచారం కనిపిస్తుంది. ఈ వివరాల ఆధారంగా ఆ సందేశానికి స్పందించాలా వద్దా అని యూజర్ నిర్ణయించుకోవచ్చు. ఫోన్ నంబర్ల మాదిరిగా యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసి కాంటాక్ట్ చేసే అవకాశం ఉండదని, ఇది వినియోగదారుల ప్రైవసీకి మరింత రక్షణ కల్పిస్తుందని పేర్కొంది. అదనపు భద్రత కోసం 'యూజర్‌నేమ్ కీ' అనే మరో ఫీచర్‌ను కూడా పరిచయం చేయనున్నట్లు, దీనిని ఎనేబుల్ చేసుకుంటే యూజర్‌నేమ్‌తో పాటు ఈ ప్రత్యేక కీ కూడా ఎంటర్ చేస్తేనే ఇతరులు సంప్రదించగలరని వివరించింది. భారత ప్రభుత్వ ఆదేశాలు అంతకుముందు ఈ కొత్త యూజర్‌నేమ్ ఫీచర్‌పై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని వాట్సాప్‌ను ఆదేశించింది. ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, ఆమోదం పొందే వరకు ఈ ఫీచర్‌ను భారత్‌లో ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలోనే వాట్సాప్ ఈ వివరణ ఇస్తూ, ప్రస్తుతానికి భారత్‌లో ఈ ఫీచర్ విడుదల ప్రణాళికను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

## చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు- సామాన్యుడి జేబుకు చిల్లు!



ఒకప్పుడు సామాన్యుడికి అందుబాటులో ఉన్న చికెన్, కోడిగుడ్లు ఇప్పుడు జేబుకు భారంగా మారుతున్నాయి. గత కొన్ని వారాల్లోనే వీటి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాలు, నాన్‌వెజ్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వారాంతంలో చికెన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో గత వారం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.280 నుంచి రూ.300 మధ్య విక్రయించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.330 వరకు పలుకుతోంది. విజయవాడలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ కూడా కిలో చికెన్ రూ.320 నుంచి రూ.330 వరకు అమ్ముతున్నారు. కొన్ని రిటైల్ దుకాణాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం రూ.6 నుంచి రూ.7 మధ్య ఉన్న ఒక్క గుడ్డు ధర ప్రస్తుతం రూ.8కు చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే కొనాలంటే దాదాపు రూ.240 ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రొటీన్ కోసం గుడ్లపై ఆధారపడే కుటుంబాలకు ఇది అదనపు భారంగా మారింది. ఈ ధరల పెరుగుదలకు పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఎండల తీవ్రతతో పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలు పెరగడం వల్ల ఉత్పత్తి తగ్గింది. మరోవైపు మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ వ్యయం కూడా పెరిగింది. దీంతో చాలామంది రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

# స్పోర్ట్స్

## వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఖాయమా జట్టు కూర్పు ఇలా ఉంటుందా

ఇంటర్నెట్ డెస్క్:

పదిహేనేళ్ల సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో అతడిని బెంచ్‌కే పరిమితం చేసిన టీమ్ మేనేజ్‌మెంట్ తాజాగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ-20 మ్యాచ్‌లో కూడా అవకాశం ఇవ్వలేదు. అయితే వైభవ్‌కు అవకాశం ఇవ్వాలని అభిమానుల నుంచే కాదు.. మాజీ క్రికెటర్ల నుంచి కూడా డిమాండ్లు వస్తున్నాయివైభవ్‌ను ఎక్కువ కాలం బెంచ్‌కే పరిమితం చేస్తే అతడిపై ఒత్తిడి పెరగడం ఖాయమని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, జులై 4వ తేదీన మాంచెస్టర్‌లో జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌లో వైభవ్ ఆడే సూచనలు కనిపిస్తున్నాయి. జట్టులో కొన్ని కీలక మార్పులు చేసి వైభవ్‌ను ఆడించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. మాంచెస్టర్ టీ20లో అభిషేక్‌తో పాటు వైభవ్‌ను ఓపెనింగ్‌కు పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఓపెనర్‌గా ఆడుతున్న సంజూ శాంసన్‌ను మూడో స్థానంలో పంపుతారని సమాచారం. ఇక, ఇషాన్ కిషన్‌ను నాలుగు లేదా ఐదో స్థానంలో ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోందట బ్యాటింగ్ ఆర్డర్‌తో పాటు స్పిన్ విభాగంలో కూడా మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. వైస్ కెప్టెన్ తిలక్ వర్మకు విశ్రాంతినిచ్చి, అదనపు బౌలర్‌ను బరిలోకి దించే విషయాన్ని జట్టు యాజమాన్యం పరిశీలిస్తున్నట్టు సమాచారం. బ్యాటింగ్‌తో పాటు స్పిన్ బౌలింగ్ కూడా చేయగలిగే వాషింగ్టన్ సుందర్‌ను ఆడించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోందట.




## అభిమానికి హార్దిక్ పాండ్యా ఊహించని సర్‌ప్రైజ్.. రూ. 1.5 లక్షల నగదుతో పాటు తన 'ఫెరారీ' కారులో ఇంటికి పంపిన స్టార్ ఆల్‌రౌండర్!


క్రికెట్ ప్రపంచంలో అభిమానుల అచంచలమైన ప్రేమకు హద్దులు ఉండవని నిరూపించే మరో అరుదైన ఘటన వెలుగుచూసింది. ఒడిశాకు చెందిన దీపక్ (18) అనే క్రికెట్ అభిమాని, తన ఆరాధ్య ఆటగాడైన భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను కలవాలనే బలమైన కోరికతో సైకిల్‌పై ప్రయాణమయ్యాడు. ఒడిశా నుండి బెంగళూరు వరకు దాదాపు 10 నుండి 12 రోజుల పాటు 1,800 కిలోమీటర్లకు పైగా సైకిల్ తొక్కి బెంగళూరు చేరుకున్నాడు. ఈ అసాధారణ అభిమానానికి సంబంధించిన కథనం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో శిక్షణ పొందుతున్న హార్దిక్ పాండ్యాను ఈ యువకుడు ఎట్టకేలకు కలుసుకున్నాడు. ఈ సందర్భంగా దీపక్ తన వెంట తెచ్చిన ఒడిశా సంప్రదాయ శాలువాతో పాటు, పవిత్రమైన పూరీ జగన్నాథుడి విగ్రహాన్నిహార్దిక్‌కు కానుకగా సమర్పించాడు. అంత దూరం నుండి తన కోసం వచ్చిన అభిమానిని చూసి చలించిపోయిన హార్దిక్ పాండ్యా, ఆ యువకుడిని ఎంతో ఆప్యాయంగా కౌగిలించుకుని స్వాగతించాడు.

**-ఫెరారీ కారులో తిరుగు ప్రయాణం!**

అభిమాని చూపించిన ఈ అంతులేని ప్రేమకు ముగ్ధుడైన హార్దిక్.. కేవలం మాట్లాడి వదిలేయకుండా ఒక ఉదారత్వాన్ని చాటుకున్నాడు. ఆ కుర్రాడి భవిష్యత్తు, ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ. 1.5 లక్షల నగదును బహుమతిగా అందించాడు. అంతేకాకుండా, తిరిగి అంత దూరం సైకిల్‌పై వెళ్లడం కష్టమని భావించి, ఆ అభిమానిని అత్యంత గౌరవంగా తన సొంత 'ఫెరారీ' లగ్జరీ కారులో ఒడిశాలోని ఆయన ఇంటికి పంపించే ఏర్పాట్లు చేశాడు. హార్దిక్ పాండ్యా చేసిన ఈ గొప్ప పనిపై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. మైదానంలోనే కాకుండా నిజ జీవితంలోనూ హార్దిక్ రియల్ హీరో అని కొనియాడుతున్నారు.



## అమెరికాలో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ కల నెరవేరిందన్న షారుఖ్!




బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం నెరవేరింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' ప్రారంభం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది అమెరికాలో క్రికెట్ విస్తరణకు ఒక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఈ మైదానంలో జులై 1న తొలి మేజర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య ఈ మ్యాచ్ జరిగింది. తద్వారా తమ సొంత విపణి వెలుపల అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, "ఒకప్పుడు కలగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నేడు వాస్తవరూపం దాల్చింది. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం ఒక చరిత్రాత్మక ఘట్టం. ఇది కేవలం క్రీడా వేదిక మాత్రమే కాదు, సమాజం, వినోదం, కుటుంబాల కోసం నిర్మించిన ప్రదేశం. దీనిని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నాను" అని వివరించారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షా తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు ఒక నిదర్శనమని పేర్కొన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో, కేవలం 100 రోజుల్లోనే ఈ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం 5,000 మంది కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ మైదానాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000కు పెంచనున్నారు. ఒలింపిక్స్‌లో టీ20 క్రికెట్ పోటీలకు ఈ మైదానం ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది.

# ‘నాగబంధం’ రిలీజ్ బుక్‌మైషో పోర్టల్ లో సూపర్ రెస్పాన్స్!



ద్వారకా క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. మైథలాజికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి ప్రచారాన్ని వేగవంతం చేసింది. అభిషేక్ నామా దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో నటించగా.. నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. జగపతిబాబు, మహేశ్ మంజ్రేకర్, రిషబ్ సాహ్నీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాపై ‘బుక్‌మైషో’లో ఇప్పటికే లక్షకు పైగా ఆసక్తులు నమోదయ్యాయని, “రేపటి నుంచి తాండవం మొదలవుతుంది” అని చిత్ర నిర్మాతలు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. పురాతన నిధి, నాగసర్పాల నేపథ్యంలో సాగే కథగా పోస్టర్‌ను బట్టి అర్థమవుతోంది. ప్రధాన పాత్రధారి భారీ దేహంతో, చుట్టూ నాగసర్పాలతో ఉన్న లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు పెద్దపీట వేస్తూ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌తో పాటు ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రారంభమయ్యాయి.

## అంచనాలు పెంచేసిన నోలన్ ‘ది ఒడిస్సీ’ కౌంట్‌డౌన్ ట్రైలర్ వచ్చేసింది!

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ చిత్రం ‘ది ఒడిస్సీ’ నుంచి ఫైనల్ ట్రైలర్ విడుదలైంది. యూనివర్సల్ పిక్చర్స్ రిలీజ్ చేసిన ఈ ‘కౌంట్‌డౌన్ ట్రైలర్’ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గ్రీక్ పురాణాల ఆధారంగా ఈ సినిమా ఒక విజువల్ వండర్‌గా తెరకెక్కుతోంది.ట్రోజన్ యుద్ధం ముగిశాక ఇథాకా రాజు ‘ఒడిస్సియస్’ తన రాజ్యానికి, భార్య వద్దకు తిరిగి రావడానికి పదేళ్లపాటు చేసిన ప్రమాదకర ప్రయాణమే ఈ సినిమా కథ. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో సముద్రపు తుపానులు, భయంకరమైన రాక్షసులతో పోరాటాలు, యుద్ధ సన్నివేశాలను గ్రాండ్‌గా చూపించారు. నోలన్ మార్క్ విజువల్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ఈ చిత్రంలో ఒడిస్సియస్ పాత్రలో ప్రముఖ నటుడు మాట్ డామన్ నటించగా, అతని భార్య పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపించనుంది. వీరితో పాటు టామ్ హాలండ్, రాబర్ట్ ప్యాటిన్సన్, జెండయా, షార్లిజ్ థెరాన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఈ నెల 17న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.




## రాజకీయాల్లోకి స్టార్ హీరో సూర్య.. నిజమెంత?



తమిళనాడు రాజకీయాల్లో సినీ గ్లామర్ మరోసారి చర్చనీయాంశమైంది. నటుడు విజయ్ దళపతి పొలిటికల్ ఎంట్రీతో విజయవంతం కావడంతో ఇతర స్టార్ హీరోల రాజకీయ ప్రవేశంపై తరచూ ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో స్టార్ హీరో సూర్య త్వరలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారంటూ వచ్చిన వార్తలు కోలీవుడ్ వర్గాల్లో కలకలం రేపాయి. సోషల్ మీడియాలో ఈ ప్రచారం జోరుగా సాగడంతో దీనిపై సూర్య టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. అభిమాన సంఘం నేత వ్యాఖ్యలతోనే.. సూర్య ఎన్నో ఏళ్లుగా ‘అగరం ఫౌండేషన్’ ద్వారా విద్యార్థులకు, పేదలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన అభిమాన సంఘాలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాయి. ఇటీవల చెన్నైలో జరిగిన ‘సూర్య అఖిల భారత అభిమానుల పరిరక్షణ సంఘం’ సమావేశంలో సంఘ ప్రతినిధి ఆర్. వీరమణి మాట్లాడుతూ భవిష్యత్తులో సూర్య రాజకీయాల్లోకి రావడం ఖాయమనే అర్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఆధారం చేసుకుని కొన్ని తమిళ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించడంతో సూర్య రాజకీయ అరంగేట్రం వార్త వేగంగా వైరల్ అయింది. విజయ్ తరహాలోనే సూర్య కూడా ప్రజాసేవ నుంచి రాజకీయాల్లోకి వస్తున్నారని అభిమానులు అంచనా వేశారు. పుకార్లకు తెరదించిన సూర్య టీమ్ ఈ ప్రచారం ఊపందుకోవడంతో సూర్య టీమ్ వెంటనే రంగంలోకి దిగింది. సూర్యకు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ప్రస్తుతానికి ఎంతమాత్రం లేదని స్పష్టం చేసింది. అభిమాన సంఘం సమావేశంలో వీరమణి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, వాటితో సూర్యకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది.



## ‘లాకప్ 2’లో రామ్ కపూర్‌కు కంగనా స్ట్రాంగ్ వార్నింగ్

ప్రముఖ రియాలిటీ షో ‘లాకప్: సచ్ యా సజా’ సీజన్ 2లో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సందడి చేశారు. ‘జనతా కీ ఆవాజ్’ ప్రతినిధిగా ఈ షోకు వచ్చిన ఆమె, కంటెస్టెంట్‌గా ఉన్న సీనియర్ నటుడు రామ్ కపూర్ వైఖరిని తప్పుపట్టారు. వ్యక్తిత్వంలో మెరుగుదల కోరుకునే వారు తమను తాము సమర్థించుకోవడం మానుకోవాలని ఆమె హితవు పలికారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమవుతున్న ఈ షోకు ఫరా ఖాన్, రితేశ్ దేశ్‌ముఖ్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు. షో ఐదో ఎపిసోడ్‌లో కంటెస్టెంట్ల ప్రవర్తనను సమీక్షించేందుకు కంగనా రనౌత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నేరుగా రామ్ కపూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. “మీరు ఈ ఆటను అస్సలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ జైలు వాతావరణం మీకు సరిపడదని భావిస్తే, అసలు ఇక్కడికి ఎందుకు వచ్చారు?” అని నిలదీశారు. దీనికి రామ్ కపూర్ తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయగా.. “మీలో మార్పు రావాలని మీరు నిజంగా కోరుకుంటే, ముందుగా మిమ్మల్ని మీరు సమర్థించుకోవడం ఆపండి” అని కంగనా స్పష్టం చేశారు. ఇదే ఎపిసోడ్‌లో అంతకుముందు హోస్ట్ ఫరా ఖాన్ కూడా రామ్ కపూర్‌కు చురకలంటించారు. సాధారణంగా వివిధ ప్రాజెక్టులలో కథానాయకుడిగా కనిపించే రామ్, ఈ షోలో మాత్రం వెనుకబడిపోతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీనిపై రామ్ కపూర్ తీవ్రంగా స్పందిస్తూ.. “అయితే నన్ను పంపించేయండి.. నేను మారను, నా ప్రవర్తన ఇలాగే ఉంటుంది” అని పేర్కొన్నారు. దీనిపై ఫరా ఖాన్ వ్యంగ్యంగా స్పందిస్తూ.. “పరిస్థితులకు అనుగుణంగా మారని వారు డైనోసార్లలా కనుమరుగైపోతారు” అని వ్యాఖ్యానించారు. మొదటి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన కంగనా, ఈసారి అతిథిగా వచ్చి కంటెస్టెంట్ల ప్రవర్తనపై స్పందించడం ఆసక్తికరంగా మారింది. ఈ ఎపిసోడ్ ప్రసారమైన తర్వాత సోషల్ మీడియాలో దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

# ‘ఇసకపట్నం’ (అమెజాన్ ప్రైమ్) సిరీస్ రివ్యూ!

సముద్రఖని – ఐశ్వర్య రాజేశ్ ప్రధానమైన పాత్రలను పోషించిన తెలుగు సిరీస్ ‘ఇసకపట్నం’. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా రూపొందింది. ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూర్చిన ఈ సిరీస్, ఈ రోజు (జులై 2)వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. సునీల్ .. నరేశ్ అగస్త్య .. రాజీవ్ కనకాల .. బెనర్జీ కీలకమైన పాత్రలను పోషించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ విశేషాలు ఏమిటనేది ఇప్పుడు చూద్దాం. నాయుడు (సముద్రఖని) తన భార్యాబిడ్డలతో కలిసి, ఒక సాధారణ వ్యక్తిలా ‘ఇసకపట్నం’లో అడుగుపెడతాడు. సముద్రంపై ఆధారపడి మత్స్యకారులు జీవించే ప్రాంతం అది. అక్కడి మత్స్య కారులంతా చిన్నారావు (రాజీవ్ కనకాల) చెప్పినట్టుగా నడుచుకుంటూ ఉంటారు. అది ‘పోతన’ (జ్వాలా కోటి)కి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. అది గ్రహించిన నాయుడు, అతని సపోర్టుతో చిన్నరావును హత్య చేసి తాను నాయకుడు అవుతాడు.నాయుడు ఆ పోర్టు ఏరియాలో తిరుగులేని నాయకుడిగా ఎదుగుతాడు. అతని కూతురు భారతి (ఐశ్వర్య రాజేశ్) వయసుకి వస్తుంది. తండ్రి దుర్మార్గాలను ప్రత్యక్షంగా చూస్తూ పెరిగిన ఆమె, సమాజానికి మేలు చేసే పనులను చేస్తూ వెళుతుంటుంది. తమ కారు డ్రైవర్ గా పనిచేస్తున్న సూరి (సుధాకర్ కోమకుల)తో ప్రేమలో ఉంటుంది. నాయుడు ఆధిపత్యం అంతకంతకూ పెరుగుతూ వెళ్లడాన్ని పోతన తట్టుకోలేకపోతాడు. నాయుడికి శత్రువైన జమిందార్ ప్రతాప్ వర్మ ( రవి వర్మ) సపోర్టు తీసుకుంటాడు. అదే ఊళ్లో ఆటో నడుపుకుని జీవిస్తున్న పెద్దన్న (నరేశ్ అగస్త్య)కి కార్పొరేటర్ కావాలని ఉంటుంది. రాజకీయాలకు .. ముఠా తగాదాలకు దూరంగా అతను తన జీవితాన్ని కొనసాగిస్తుంటాడు. ఇక నాయుడు కూడానే ఉండే శేఖరం (రాజా) అతని కుర్చీలో కూర్చునే అవకాశం కోసం వెయిట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే పోతన – ప్రతాప్ వర్మ చేతులు కలిపినట్టుగా నాయుడికి తెలుస్తుంది. ప్రతాప్ వర్మకి గల ఆర్థికబలం గురించి తెలిసిన నాయుడు, అతనికి తన కూతురు భారతినిచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449